క్లుప్తంగా

రేపటి నుంచి దేవి నవరాత్రులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి మాత ఆలయంలో ఈ నెల 22 నుంచి దేవి నవరాత్రులను నిర్వహించనున్నట్లు అర్చకులు అనంతయ్య శనివారం తెలిపారు. 22వ తేదీన బాల త్రిపురసుందర దేవిగా, 23న గాయత్రి దేవి, 24న అన్నపూర్ణదేవి, 25న కాత్యాయని, 26న మహాలక్ష్మిదేవి, 27న లలిత త్రిపురా సుందరదేవి, 28న మహాచండీదేవి, 29న సరస్వతి దేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసుర మర్దిని, 2న శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు అర్చకులు వివరించారు.

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా గ్రామమైన వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ ఉదయాన్నే స్వామి, అమ్మవార్లకు నిత్య పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు విశేష పూజలతో పాటు కుంకుమార్చన పూజలు చేశారు. ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరుకు చెందిన నల్లగట్ల పార్థసారథిరెడ్డి, రమణమ్మ దంపతులు ఆలయాభివృద్ధికి తమ వంతుగా రూ.1,00,116 నగదును ఆలయ నిర్వాహకులు మధుసూదనరెడ్డి, రంగనాయకులు, నరసింహులుకు అందజేశారు.

ఆలయాల హుండీ సొమ్ము లెక్కింపు



శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీకాళికాంబ చంద్రశేఖర, కోటవీధిలోని శ్రీబ్రహ్మానందీశ్వర స్వామి దేవస్థానాల హుండీ కానుకల లెక్కింపును గ్రూప్ ఆఫ్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరిచంద్రా రెడ్డి, ఈవో లఓక్మునారాయణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శ్రీ కాళికాంబ చంద్రశేఖర్ దేవస్థానం హుండీ లెక్కింపులో రూ.78,763 ఆదాయం లభించిందని, బ్రహ్మానందీశ్వర స్వామి దేవస్థానం హుండీ నుంచి రూ.47,264 ఆదాయం సమకూరిందని చెప్పారు.

శిక్షణ శిబిరం వాయిదా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలోని అహోబిలంలో జరిగే బేస్ బాల్ రిఫరీ క్లినిక్ అండ్ జడ్జిల శిక్షణ శిబిరాన్ని వర్షం కారణంగా వాయిదా వేస్తున్నట్లు నంద్యాల జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు సుబ్బయ్య, రమణయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు అహోబిలంలో జరిగే క్యాంపు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ : 9885859183 నంబరులో సంప్రదించాలని కోరారు.

చెట్లు ప్రగతికి మెట్లు



మొక్కలు నాటుతున్న గ్రామ సర్పంచ్, అధికారులు

ఉయ్యాలవాడ : చెట్లు ప్రగతికి మెట్లని హెచ్‌ఎం బాబు, తహసీల్దార్ ప్రసాద్‌బాబు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కనాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో, హరివరం ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ మేకల ఓబులేస్, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయ బృందం విద్యార్థులతో కలిసి వంద మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశం మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి హాజరగు మండల స్థాయి అధికారులందరూ ప్రగతి నివేదికలు సంబంధించి పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

నేడు రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని టెక్కె మార్కెట్‌యార్డులో క్రీడా భారతి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్కేటింగ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాభారతి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఆదివారం జరిగే పోటీలకు ఉదయం 7గంటలకే హాజరు కావాలని సూచించారు.

పొంగిన వాగులు.. నీట మునిగిన పంటలు



ఎర్రగుడిదిన్నె వద్ద నీట మునిగిన వరి పైరు

రుద్రవరం: మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి వర్షం భారీగా కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వరి, మినుము, మొక్క జొన్న వంటి పంటలు నీట మునిగాయి. చందలూరు, ఎర్రగుడిదిన్నె, చిలుకలూ రు, మాచినేనిపల్లె, పేరూరు, హరినగరం, ముకుందాపురం, చిత్రేనిపల్లె, ఆలమూరు తదితర గ్రామాల పరిధిలో మొలక దశలో ఉన్న పైర్లలో నీరు నిలిచింది. అలాగే ఇటీవల కోతలు కోయించి ఆరబోసిన మొక్కజొన్నలు తడిసి పోవడంతో రైతులు నష్ట పోయారు. మండల పరిధిలోని చిలుకలూరు నుంచి బత్తలూరు హైవే వైపు వెళ్లే దారిలోని వకిలేరు వాగు లోలెవెల్ వంతెనపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో గ్రామస్తులు రాక పోకలు సాగించడంలో ఇబ్బందులు పడ్డారు.

నీట మునిగిన పంట పొలాలు

ఉయ్యాలవాడ : మండలంలో గత మూడు రోజులుగా భారీ వర్షం కురుస్తూనే ఉంది. శనివారం తెల్లవారుజామున కూడా దాదాపు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వర్షపు నీరంతా పంట పొలాల్లోకి చేరడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆర్.పాంపల్లె, ఇంజేడు, పెద్దయ మ్మనూరు, బోడెమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, అల్లూరు గ్రామాల సమీపంలో మొక్కజొన్న, వరి, మిరప, మినుము, పత్తి, తదితర పంటలు నీట మునిగాయి. ఎకరాకు ఎరువులు, విత్తనాలు, సేద్యాలు కలిపి రూ. 20 వేలు వ్యయం చేసి పంట సాగు చేశామని రైతులు వాపోతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు మరో వైపు శ్రీశైలం, అవుకు రిజర్వాయర్ల నుంచి మండలంలోని కుందూనదిలోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నీరు పంట పొలాల్లోకి చేరుతుండడంతో పంటలు మునిగాయి. అధికారులు పంట పొలాలను పరిశీలించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.



చిలుకలూరు వద్ద వంతెనపై పారుతున్న వరద నీరు



ఆర్.పాంపల్లె సమీపంలో నీట మునిగిన మొక్కజొన్న పంట

జీవాల సంత స్థలాన్ని మార్చాలి



వంతెనపై ట్రాఫిక్ రద్దీతో నిలిచి పోయిన వాహనాలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రాణిమహారాణి థియేటర్ వద్ద ఉన్న శనివారం జరిగే జీవాల సంతను మార్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ శనివారం డిమాండ్ చేశారు. కుందూనది పక్కన ఉన్న జీవాల సంత జరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. వంతెనపై ఎస్సార్‌బీసీ, నందమూరినగర్, వైఎస్సార్‌నగర్, రాయమాల్పురం, పులిమద్ది, మునగాల పోలూరు, తదితర గ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారన్నారు. పక్కన నిర్మిస్తున్న వంతెనను పూర్తి చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. అధికారులు స్పందించి సంత స్థలాన్ని మార్చాలని కోరారు.

మొక్కలను విరివిగా పెంచాలి



మొక్క నాటి నీరుపోస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా కోరారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ మాసంలో గ్రీన్ ఏపీ థీమ్‌లో భాగంగా జిల్లాలో మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి, గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటాలని సూచించారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జ్యూట్/కాటన్ బ్యాగులు వాడేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో మొక్కలు నాటారు. జేసీ విష్ణు చరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, ఏఓ సుభాకర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం

డోన్ టౌన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ హెచ్చరించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన రణభేరి బైకుయాత్ర శుక్రవారం రాత్రి డోన్‌కి చేరింది. పాత బస్టాండ్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, దసరాకు ఒక డీఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసనలు



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): విద్యుత్ ఉద్యోగుల నిరసన శనివారం కొనసాగింది. భోజన విరామ సమయంలో నంద్యాల విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయ సమీపంలో జిల్లా స్థాయి ఉద్యోగులు నిరసన తెలిపి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, కృపవరం మాట్లాడుతూ జీపీఎస్‌తో కూడిన పెన్షన్, రెగ్యులరైజేషన్, పనికి తగ్గ వేతనం, డీఏల మంజూరు, ఖాళీల భర్తీ, సబ్ స్టేషన్ల కాంట్రాక్ట్ ఇవ్వడం నిలుపుదల వంటి 17 డిమాండ్ల పరిష్కరించాలన్నారు. 22న ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు రామయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య శాస్త్రి జయంతి



శాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన శతాధిక పుస్తక రచయిత, ప్రముఖ కవి కీ.శే. గొట్టిముక్కల సుబ్రహ్మణ్య శాస్త్రి 82వ జయంతిని భారతి సీడ్స్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నంది రైతు సమాఖ్య సలహాదారు విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ సాహిత్య సంఘాల ప్రతినిధులు, కవులు సుబ్రహ్మణ్య శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ నంద్యాల కీర్తి కిరీటంలో సుబ్రహ్మణ్య శాస్త్రి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, శతాధిక గ్రంథాలు రాయడం వల్ల తెలుగు సాహితీ చరిత్రలో నంద్యాల ప్రముఖ స్థానంలో నిలిచిందన్నారు. సూరన సారస్వత సంఘం కార్యదర్శిగా 40 సంవత్సరాలు కొనసాగిన శాస్త్రి.. పట్టణంలో అనేక సాహితీ కార్యక్రమాల నిర్వహణలో క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. అనంతరం శాస్త్రి సోదరుడి కుమారుడైన రాఘవేంద్ర శర్మను సత్కరించారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, రచయిత కొప్పుల ప్రసాద్, రఫీ, కుందూ సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ కిశోర్ కుమార్, సమాఖ్య ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ ఓబుళపతి పాల్గొన్నారు.

సేవా భావం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ లీలావతి

రుద్రవరం: విద్యార్థులు సమాజం పట్ల సేవా భావం కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ లీలావతి అన్నారు. మండల కేంద్రమైన రుద్రవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్‌వాడీ సిబ్బంది 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రతి రోజు విద్యార్థులు పోషకాలతో కూడిన ఆహారం, పండ్లు, ఆకుకూరలు, గుడ్డు వంటివి తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి రోజు ఏదో ఒక సమయంలో వ్యాయామం చేయాలని, అలా చేయడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ తేజేశ్వరి, సూపర్‌వైజర్ రషీదా బేగం, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ కరీముల్లా అధ్యక్షతన ఆల్‌మేవా గౌరవాధ్యక్షుడు అబులైజ్, రిటైర్డు ఎంఈఓ వెంకటరమణ, రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్రాన్ పాషా ఆధ్వర్యంలో తబసుమ్ అనే విద్యార్థినికి రూ. 25వేల చెక్కును అందజేశారని ప్రిన్సిపాల్ శనివారం తెలిపారు. 16 సంవత్సరాలు విద్యకు దూరంగా ఉన్నప్పటికీ జిల్లా టాపర్‌గా నిలవడంతో తబసుమ్‌కు చెక్కు అందజేసినట్లు తెలిపారు. 2007లో పదో తరగతి చదివి మానుకోవడంతో 2023లో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో చదివి ఉర్దూలో టాపర్‌గా నిలవడంతో ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.

ఆసుపత్రికి ఫ్యాన్ల అందజేత



ఫ్యాన్లను అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: నంద్యాల ప్రభుత్వాసుపత్రికి సీలింగ్ ఫ్యాన్లు అందజేసిన దాతల సహకారం మరువలేనిదని, నంద్యాల ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. శనివారం మధుమణి చారిటబుల్ సొసైటీ వారు ఆసుపత్రికి రూ.15వేలు విలువజేసే ఆరు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. సొసైటీ అధినేత డాక్టర్ మధుసూదనరావు , డాక్టర్ రవికృష్ణ, డాక్టర్లు అరుణజ్యోతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో మోడల్ పాఠశాల ఉపాధ్యాయ బృందం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు శనివారం తెలిపారు. అండర్-19 ఎస్‌జీఎఫ్‌లో భాగంగా కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో రుద్రవరం మోడల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరచి ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన ఇంటర్ రెండో సంవత్సరానికి చెందిన సీహెచ్.భార్గవి, తనుష్క, సాయికుమార్, మహేశ్వరి, నరేంద్ర, యశస్విని, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఎం.భార్గవిలను, పీడీ శ్రీనివాసులును శనివారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

నామమాత్రంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర



గోస్పాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పారిశుద్ధ్యం ఇలా..

- ప్రభుత్వం, ఉన్నతాధికారుల సంతృప్తి కోసమే కార్యక్రమం
- గ్రామాల్లో అవగాహన కల్పించని అధికారులు
- ప్రభుత్వ కార్యాలయాల వద్దే అపరిశుభ్రత



ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ విష్ణుచరణ్

గోస్పాడు: పచ్చదనం, పరిశుభ్రత కోసమంటూ కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తోంది. ఇందులో జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొంటున్నారు. అయితే కార్యక్రమం మొత్తం మొక్కుబడిగా సాగుతోంది. కార్యక్రమంపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు శూన్యం. కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ గోస్పాడులో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటగా అధికారులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం నిర్వహించే కార్యక్రమం ఏమిటని, ఎందుకు నిర్వహిస్తున్నారు, పాటు ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నా అని అడిగారు. కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన లేకపోవడంతో వారు తడబడ్డారు. గమనించిన స్థానిక అధికారులు కల్పించుకొని సమాధానమిచ్చారు. స్థానిక సచివాలయ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. అయితే స్థానిక ఎంపీడీఓ, హౌసింగ్ కార్యాలయాల వద్ద పారిశుద్ధ్యం నానాటికీ తీసికట్టుగా మారుతున్నా మండల స్థాయి అధికారుల్లో చలనం లేకపోవడం విశేషం. కేవలం ప్రభుత్వం ఆదేశించిందని, ఉన్నాతాధికారులు పాల్గొంటున్నారని మొక్కుబడిగా కార్యక్రమం నిర్వహిస్తున్నారని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ విజయశైలజ రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రీన్ ఏపీ గురించి విద్యార్థులకు వివరించారు. పచ్చదనం ప్రాముఖ్యతను, కాలుష్యం పరిణామాలపై అవగాహన కల్పించారు.అధ్యాపకులు,విద్యార్థులుపాల్గొన్నారు.

ఔషధ దుష్ప్రభావాలను నిరోధించాలి

గోస్పాడు: ఔషధ దుష్ప్రభావాలను నిరోధించడం వల్ల రోగులకు ప్రయోజనం చేకూరుతుందని నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ కార్యక్రమం శనివారం మెడికల్ కళాశాలలో ఫార్మాకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శాంతబాయి ఆధ్వర్యంలో పీహెచ్‌సీల డాక్టర్లు, సీహెచ్‌ఓలకు, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మందుల వాడకం వల్ల ఒక్కోసారి దుష్ప్రభావాలు కలిగే అవకాశం ఉందన్నారు. ఏఏ రకాల మందులు దుష్ప్రభావాలు కలిగిస్తున్నాయో తెలుసుకోవాలని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ పాల్గొన్నారు.



మెడికల్ కళాశాలలో మొక్క నాటుతున్న దృశ్యం

మెడికల్ కళాశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర..

పట్టణంలోని మెడికల్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగించారు.

నంద్యాల మండల తహసీల్దార్‌గా శ్రీవాణి



సాక్షి ఎఫెక్ట్

నంద్యాల(అర్బన్): 'నంద్యాలకు తహసీల్దార్ కావాలి' శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో వెలువడిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. నంద్యాల రూరల్ తహసీల్దార్‌గా శ్రీవాణిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. ఎస్సార్బీసీ ల్యాండ్ అక్విషన్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీవాణి రూరల్ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. ఈ మేరకు శ్రీవాణి మంత్రి ఫరూక్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం అమావాస్య ఉండటంతో బాధ్యతలు తీసుకోలేదని, సోమ, మంగళవారాల్లో విధుల్లో చేరనున్నారని కార్యాలయ అధికారులు తెలిపారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



లోగోను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): ప్రస్తుత తరానికి కావలసిన విలువలు, విద్యార్థులను లక్ష్యసాధనకు ప్రోత్సహించి సాధించేలా చూడాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. శనివారం తన చాంబర్‌లో గెలివి వెంకటేశ్వర విద్యాలయం సిల్వర్ జూబ్లీ లోగోను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్నికల పద్ధతిని విశేషంగా అభినందిస్తూ, సమాజానికి కావలసిన మంచి నాయకులను తీర్చిదిద్దడంలో ఇది గొప్ప అడుగు అని తెలిపారు. డాక్టర్ గెలివి సహదేవుడు, గెలివి రామకృష్ణ, గెలివి శరత్ తదితరులు పాల్గొన్నారు.

సిగటోకా తెగులు పట్ల జాగ్రత్త వహించాలి

మహానంది: అరటిలో సిగటోకా తెగులు వస్తుందని, రైతులు నివారణ చర్యలు తీసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం సైంటిస్ట్ డాక్టర్ హేమాద్రి సూచించారు. గాజులపల్లెలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సిగటోకా తెగులు సోకిన ఆకులను తొలగించి కాల్చేయాలన్నారు. నివారణకు ఆరు నెలలలోపు ఉన్న పంటలకు ప్రొపికొనజోల్ లేదా మాంకజెబ్ మందులను, ఆరునెలల కంటే ఎక్కువగా ఉన్న పంటలకు టెబుకనజోల్, క్లోరథలోనిల్ లాంటి వాటిని వాడుకోవాలన్నారు. అరటిలో తామర పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లాంటి వాటిని ఉపయోగించాలన్నారు. ఉద్యాన శాఖ అధికారి బి.హరేంద్ర పాల్గొన్నారు.

నేడు నంద్యాలకు మహానందీశుడి దంపతులు

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులు ఆదివారం నంద్యాలకు వెళ్లనున్నారు. ఆనవాయితీ ప్రకారం ఏటా దసరా ఉత్సవాలకు స్వామి, అమ్మవార్లు నంద్యాలలోని బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానానికి వెళ్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలతో బయలుదేరి వెళ్తారని వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.